# కొళ్ళు



కొంపెల్ల విశ్వం

ఉదయం సరిగ్గా ఆరుగంటలకు హైదరాబాదులో వుండవల్సిన బస్సు తొమ్మిదిన్నరకి కాని చేరుకోలేదు.

నేనుండేది హిమాయత్‌నగర్‌లో.

ఆ వేళ ఆదివారం. మర్నాడు నేను ఆఫీసుకెళ్ళాలి.

ఇక్కడ కొంత ఫ్లాష్ బ్యాక్ అవసరం ఈ కథకి ఎంతైనా వుంది— నేను హైదరాబాదు వెళ్ళిపోతున్నానని తెలిసి, మా ఊరిలో మా ఎదురింటి కమలమ్మగారు "శ్రమనుకోపోతే అక్కడ మా తమ్ముడున్నాడు. వాడికి నేనిచ్చే సామాన్లు అందజేయాలి బాబూ!" అన్నారు.

అనటమే కాదు - నా సమ్మతికోసం చూడకుండా ఇంత - సైజు ప్యాకెట్టు (అదేదో ఎరువుల కంపెనీ నంచీని ఖాళీ చేసి, సగంచేసి అందులో సామాన్లన్నీ పెట్టి, మళ్ళీ దబ్బనంతో కుట్టి) నా కందజేశారు. నేను విసుక్కోబోయాను కాని, మా అమ్మ నాకా అవకాశం ఇవ్వలేదు. నాకవన్నీ మోసుకుని రాకతప్పలేదు.

ఫ్లాష్ బ్యాక్ అయిందా, ఇక ప్రస్తుతం—

ఆయనగారు సైదాబాదు కాలనీలో వుంటాట్ట. ఆ ప్యాకెట్టేదో పట్టికెళ్ళి ఇవేళే ఇచ్చేస్తే నయం. మళ్ళీ రేపటి




నుంచి ఆఫీసు, హడావిడి - అనుకుని టైము నాలుగవుతుండే సైదాబాదు కాలనీ వెళ్ళాను.

ఇల్లు త్వరగానే దొరికింది. కాని——

ఎంతసేపు తలుపు బాదినా ఎవరూ తీయరు. "ఎవరండీ ఈ ఇంట్లో ?" అని రెండు మూడు కేకలు కూడా వేశాను. పావుగంటసేపు తలుపుకొట్టి, ఇక వెనక్కి తిరిగి వెళ్ళిపోదామను కుంటూ వుండగా—

తలుపులు తెరుచుకున్నాయి.

నాకు మాట పడిపోయింది. నా చేతిలో వున్న కాగితం (వాళ్ళ అక్క ఇచ్చింది) అతని చేతికిచ్చి అలాగే నిలబడిపోయాను.

కాగితం ఒకసారి చూసుకుని, కూచోండి — అన్నాడతను. కూచున్నాను.

సంజాయిషీ చెప్పుకుంటున్నట్టుగా అన్నాడతను "తనేమో, ఏదో పనుండి బైటకెళ్ళింది. పిల్లల సామానూ ఇంట్లోకి బైటికి తిరుగుతుండే కోప్పడి, బైట ఆడుకోండని తలుపేశాను - తలుపు తీయగానే తెలుసుంటుంది మీకు, తలుపు తీయటం ఎందు కాలస్యమైందో ?"

ఏమంటాను నేను ? అతనికి రెండు కాళ్ళూ లేవు.

——